
నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, ఆదివారం 7 ఏప్రిల్ 2024 | BHADRADRI KOTHAGUDEM

# అన్నదాతకు అండగా బీఆర్ఎస్



**ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా రైతుదీక్షలు**

**హాజరైన ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్**

**రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్**




మాట్లాడుతున్న వద్దిరాజు రవిచంద్ర



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర






వైరా : రైతు దీక్షలో నినాదాలు చేస్తున్న ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్

ఖమ్మం ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సాగునీటి సమస్య రాకుండా చూడాలని, రుణమాఫీ, ధాన్యం బోనస్ తక్షణం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రైతులకు మద్దతుగా శనివారం బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన రైతుదీక్షలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విశేష స్పందన కనిపించింది. ఎర్రటిఎండలో సైతం 'రైతుల కోసం మేమున్నాం' అంటూ పెద్దఎత్తున బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యధోరణిని తీవ్రంగా ఖండించారు. నియోజకవర్గాల కేంద్రాల్లో జరిగిన రైతుదీక్షా కార్యక్రమాలకు ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తాతా మధుసూదన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుతోపాటు మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు హాజరై కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతువ్యతిరేక విధానాలు, బీఆర్ఎస్ పార్టీ పోరాటాలు తదితర అంశాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పాలేరు నియోజకవర్గ స్థాయి రైతుదీక్ష కార్యక్రమం ఖమ్మంరూరల్ మండలం వరంగల్ క్రాస్ రోడ్ వద్ద మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి హాజరైన నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధు మాట్లాడారు. జడ్పీ వైస్ చైర్మన్ ఎం.ధనలక్ష్మి, ఎంపీపీ ఉమ, జడ్పీటీసీ వరప్రసాద్‌తోపాటు ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు. సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో రైతుదీక్ష జరిగింది. బీఆర్ఎస్ లోక్‌సభాపక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర హాజరై కాంగ్రెస్ ప్రభుత్వ రైతువ్యతిరేక విధానాలపై మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ ఆధ్వర్యంలో జరిగిన వైరా నియోజకవర్గ స్థాయి రైతుదీక్షా నిరసన కార్యక్రమంలో సైతం ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర హాజరై పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. మధిర నియోజకవర్గ కేంద్రంలో జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు హాజరయ్యారు. ఖమ్మం నియోజకవర్గ కార్యక్రమం రఘునాధపాలెం మండలం మంచుకొండలో జరిగింది. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరూనాయక్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర పార్టీ నాయకులు హాజరయ్యారు. ఇల్లెందు నియోజకవర్గ కేంద్రంలో జరిగిన రైతుదీక్ష నిరసనకు ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్, మహబూబాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని, ధాన్యంకు క్వింటాల్ ఒక్కంటికి రూ.500 బోనస్, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు ఇవ్వాలని, తక్షణం రైతు రుణమాఫీ చేయాలని తహసీల్దార్‌కు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, పార్టీ నాయకులు మణుగూరులో వినతిపత్రాలు అందజేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అశ్వారావుపేట తహసీల్దార్‌కు మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.



ఖమ్మం రూరల్‌లో దీక్షలో కూర్చున్న ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ నాయకులు



అశ్వారావుపేట : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే 'మెచ్చా'



భద్రాచలం : అంబేద్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మణుగూరు : నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా, నాయకులు




ఇల్లెందు : దీక్షలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, దిండిగల రాజేందర్

## ఓటు హక్కు నమోదు వినియోగంపై..
# ప్రజలకు అవగాహన కల్పించాలి

- ప్రతి ఒక్కరూ విధిగా ఓటు వేసేలా వారిలో చైతన్యం తేవాలి
- ఇందుకోసం విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి
- వచ్చే రెండు వారాలు పూర్తిగా స్వీప్ కార్యాచరణపై దృష్టిపెట్టాలి
- స్వీప్ కోర్ కమిటీ సమావేశంలో ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, ఏప్రిల్ 6 : ఓటు నమోదు, ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. ప్రతి ఒక్కరూ విధిగా ఓటు వేసేలా వారిలో చైతన్యం తేవాలని పిలుపునిచ్చారు. ఖమ్మం ఐడీవోసీలో శనివారం ఏర్పాటుచేసిన స్వీప్ కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటుహక్కుపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని, ఓటు ప్రాముఖ్యత తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొందేలా చూడాలన్నారు. నేలకొండపల్లి, ఖమ్మం ఖిల్లా తదితర చారిత్రక స్థలాల్లో స్వీప్ కార్యాచరణ చేయాలన్నారు. పెట్రోల్ బంకులు, పోస్టాఫీసులు, రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాళ్లు, పెద్ద వాణిజ్య సముదాయాల్లో సీ-విజిల్, ఓటర్ హెల్ప్‌లైన్, 1950 టోల్ ఫ్రీ నెంబర్‌పై ప్రచార స్టాండ్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. వచ్చే రెండు వారాలు పూర్తిగా స్వీప్ కార్యాచరణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, ఇతర అధికారులు కే.శ్రీరామ్, వినోద్, హరికిషన్, సన్యాసయ్య, రాజేశ్వరి, గణేశ్, అజయ్‌కుమార్, సుమన్‌చక్రవర్తి, ప్రత్యూష, అరుణకుమారి, రాజశేఖర్, వేణు, షఫీయుల్లా, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

### ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటుచేయాలి: కలెక్టర్

జిల్లాలో ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, నిరంతర నిఘా పెట్టి వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. ఖమ్మం ఐడీవోసీలో ఆయా మండలాల తహసీల్దార్లతో శనివారం ఏర్పాటుచేసిన ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో క్రమబద్ధీకరణ జీవో 59లో చేసుకున్న దరఖాస్తులు తిరస్కరణకు గురైన చోట వెంటనే స్థలాలు స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. వాటికి ఫెన్సింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికుల పట్ల విషయంలో సమగ్ర విచారణ జరిపాలని, అసైన్డ్‌దారులకు చట్టప్రకారం నోటీసులు ఇచ్చి ఆధారాలతో హాజరయ్యేలా సమాచారం ఇవ్వాలని సూచించారు. పువ్వాడ ఉదయ్ నగర్‌లో ఖాళీ ప్లాట్ల విషయమై చర్యలు చేపట్టాలన్నారు. టేకులపల్లి డబుల్ బెడ్ రూం ఇళ్ల విషయంలోనూ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి

**నవమి ఏర్పాట్లపై సమీక్షించిన భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల**



సమీక్షలో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల, చిత్రంలో ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ) : శ్రీరామనవమి, మహా పట్టాభిషేకం మహోత్సవాలను తిలకించేందుకు భద్రాచలం విచ్చేయనున్న భక్తులకు ఇబ్బంది కలగకుండా సంబంధిత శాఖల అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. శనివారం ఐడీవోసీ సమావేశ మందిరంలో శ్రీరామనవమి, మహా పట్టాభిషేకం కార్యక్రమాల నిర్వహణపై అన్ని శాఖల జిల్లా అధికారుల కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నియమావళికి అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని, కల్యాణ వేడుకల కోసం మండపాన్ని 26 సెక్టార్లుగా విభజించి.. ప్రతి సెక్టార్‌లో భక్తులకు ఇబ్బంది లేకుండా వేడుకలు వీక్షించేందుకు పర్యవేక్షణ కోసం జిల్లా అధికారులను నియమించామన్నారు. భక్తులు ఒక సెక్టార్ నుంచి మరో సెక్టార్‌కు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి సెక్టార్‌లో కూలర్లు ఏర్పాటు చేయాలని, వసతి(లాడ్జి) కోసం భక్తులు గదులను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సౌకర్యం కల్పించామన్నారు. ఇప్పటి వరకు 1,330 ఆన్‌లైన్ టికెట్లు విక్రయించినట్లు చెప్పారు. మహోత్సవాలు నిర్వహించే రోజుల్లో మాంసం, మద్యం విక్రయాలను నిషేధించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా పటిష్ట బారికేడింగ్ ఏర్పాటుతోపాటు నాటు పడవలు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, కల్యాణ మండపానికి వచ్చే క్రమంలో భక్తుల రద్దీ నియంత్రణకు మూడంచెల భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. 24 గంటలు పనిచేసే విధంగా అత్యవసర వైద్య కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన రామయ్య కల్యాణ తలంబ్రాల వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ప్రియాంక ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, ఏఎస్పీ పరితోష్ పంకజ్, డీఆర్‌డీవో విద్యాచందన, దేవస్థానం ఈవో రమాదేవి, డీఆర్వో రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

# ఆర్థిక నేరాలపై ఉక్కుపాదం మోపాలి

- మల్టీజోన్ ఐజీపీ ఏవీ రంగనాథ్
- యువకుడి మరణానికి కారణమైన ఫైనాన్స్ సంస్థపై కేసు నమోదుకు ఆదేశం



మాట్లాడుతున్న ఐజీపీ ఏవీ రంగనాథ్ చిత్రంలో సీపీ సునీల్‌దత్

మామిళ్లగూడెం, ఏప్రిల్ 6 : గంజాయి సరఫరా, విక్రయాలకు ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేయడంతో పాటు ఆర్థిక నేరాలపై ఉక్కుపాదం మోపాలని మల్టీజోన్ ఐజీపీ ఏవీ రంగనాథ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. నేర సమీక్షా సమావేశానికి మల్టీజోన్-1 ఐజీపీ హోదాలో శనివారం మొదటిసారి ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌కు వచ్చిన రంగనాథ్‌కు సీపీ సునీల్ దత్ స్వాగతం పలుకుతూ పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన నేర సమీక్షా సమావేశంలో ఐజీపీ మాట్లాడారు. గంజాయి రవాణాను కట్టడి చేసేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. నగరంలో బైక్ ఫైనాన్స్ కిస్తీలు కట్టలేదని యువకుడిపై దాడి చేయడంతోపాటు అతడి మరణానికి కారణమైన ఫైనాన్స్ రికవరీ ఏజెంట్లతోపాటు ఫైనాన్షియర్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఆదేశించారు. అక్రమార్జనకు అలవాటుపడిన భూ కబ్జాదారులను వదిలిపెట్టొద్దని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణకు సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో అనాలసిస్ టీమ్‌ను పటిష్టపరచాలని సూచించారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు చేపట్టడంతోపాటు చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు చేయాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో విధిగా విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని, తద్వారా నేరాలు నియంత్రణలో ఉంటాయన్నారు. ఇసుక అక్రమ రవాణా చేసే వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సరిహద్దు రాష్ట్రాల నుంచి ఇసుకను అక్రమంగా తరలించే వాహనాలు పట్టుబడిన వెంటనే కేసు నమోదు చేసి సీజ్ చేయాలన్నారు. ఎన్నికల సందర్భంగా తీసుకుంటున్న చర్యలు, అనుసరిస్తున్న వ్యూహంపై ఎన్నికల బందోబస్తు, శాంతిభద్రతలపై పోలీస్ కమిషనర్ వివరించారు. పెండింగ్‌లో ఉన్న(అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, విచారణలో ఎస్సీ, ఎస్టీ, పోక్సో, ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసులతోపాటు దీర్ఘకాలిక పెండింగ్ కేసులు, తీవ్రమైన కేసుల పురోగతిపై సమీక్ష జరిపారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు, అడిషనల్ డీసీపీ గణేశ్, ఏఎస్పీలు అవినాష్‌కుమార్, మౌనిక, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రెహమాన్, రఘు, శ్రీనివాసులు, ప్రసన్నకుమార్, బోజరాజు, మల్లయ్య, ఫణింద్ర, నర్సయ్య, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.